ఆరోగ్యానికి 'యోగ'ం

- నిత్యం సాధన చేయాలంటున్న గురువులు
- యోగాపై పెరుగుతున్న అవగాహన

బుట్టాయగూడెం: ఆరోగ్యకర సమాజ నిర్మాణానికి యోగా అవసరమని ఎంఈవో తెల్లం బాబూరావు అన్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా శుక్రవారం బుట్టాయగూడెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో యునాని వైద్యాధికారి గోడి ప్రియదర్శిని ఆధ్వర్యంలో పాఠశాలలోని విద్యార్థులకు యోగాభ్యాసన చేయించారు. సుమారు 300 మంది విద్యార్థులతో భారీ ర్యాలీ నిర్వహించారు. ఎంఈవో -2 నరేంద్రరాయ్, హెచ్ఎం ఇరపా గంగాదేవి, ఉపాధ్యాయులు పి.శ్రీనివాసరావు, కె.రామచంద్రరావు, యోగా గురువు ఎం.అనిత కుమారి పాల్గొన్నారు.

జీలుగుమిల్లిలో:
స్థానిక హైస్కూల్లో యోగా దినోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎంఈవోలు కె.శ్రీనివాసరావు, ఎస్.బుచ్చిరాజులు మాట్లాడుతూ యోగా ప్రాముఖ్యతను వివరించారు.

జంగారెడ్డిగూడెం:
ప్రతి ఒక్కరూ మానసిక, శారీరక, ఆధ్యాత్మిక పరిణితి చెందడానికి యోగ ఉపయోగపడుతుందని మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, ప్రిన్సిపల్ సివిల్ జడ్జి సీహెచ్ కిషోర్ కుమార్, ఫస్ట్ క్లాస్ జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ కేఎస్ఆర్ తేజస్విలు అన్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా మండల న్యాయ సేవాధికారి సంస్థ ఆధ్వర్యంలో జంగారెడ్డిగూడెం కోర్టు ప్రాంగణంలో న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. కోర్టు సూపరింటెండ్ వైఎల్ఎన్ మూర్తి, పాల్గొన్నారు.

జంగారెడ్డిగూడెం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో యోగా డే :
స్థానిక చత్రపతి శివాజీ త్రి శతజయంతి ప్రభుత్వ డిగ్రీ కళాశాల నందు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్.ప్రసాద్‌బాబు అధ్యక్షతన పదో అంతర్జాతీయ యోగా దినోత్సవం నిర్వహించారు. నెహ్రూ యువజన కేంద్రం సభ్యులు, కళాశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.


స్థానిక విద్యారోహిణీ స్కూల్లో యోగా చేస్తున్న విద్యార్థులు


ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో యోగసనాలు వేస్తున్న విద్యార్థులు

బాలుర హైస్కూల్‌లో:
అంతర్జాతీయ యోగా దినోత్సవం పురస్కరించుకొని బాలుర హైస్కూల్ నందు పలు కార్యక్రమాలు నిర్వహించారు. విజయ ప్రకాష్, టి.జగదీష్, జయరాజు పాల్గొన్నారు.

చింతలపూడి : స్థానిక కోర్టు ఆవరణలో శుక్రవారం అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని నిర్వహించారు. జూనియర్ సివిల్ జడ్జి మధుబాబు మాట్లాడారు. న్యాయవాదులు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆధ్వర్యంలో
స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆధ్వర్యంలో అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని జరుపుకున్నారు. ఏలూరు 19 వ ఆంధ్రా బెటాలియన్ ఎన్‌సీసీ కమాండర్ కల్నల్ సౌరభ్ ముఖర్జీ ఆదేశాల మేరకు కళాశాల లెఫ్టినెంట్ జి.జీవన మౌనిక విద్యార్థులకు యోగాలో శిక్షణ ఇచ్చారు.

ఆర్ట్ ఆఫ్ లివింగ్ ఆధ్వర్యంలో
ఆర్ట్ ఆఫ్ లివింగ్, మానవత, లయన్స్ క్లబ్‌ల ఆధ్వర్యంలో యోగా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. మానవత సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

అబ్దుల్ కలాం యువజన సంక్షేమ సంస్థ ఆధ్వర్యంలో
మండలంలోని యండపల్లిలో రైతులకు, రైతు కూలీలకు అబ్దుల్ కలాం యువజన సంక్షేమ సంస్థ ఆధ్వర్యంలో యోగా దినోత్సవం నిర్వహించారు.

కామవరపుకోట: మండలంలో అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో విద్యార్థులతో యోగాసనాలు వేయించారు. తడికలపూడి హోమియోపతి ఆసుపత్రి ఫార్మసిస్ట్ వి.శ్రీనివాసరావు పాఠశాలకు రూ.5 వేలు విరాళం అందించారు. డాక్టర్ జి.శ్రీనివాసరావు, జి.రామ్మోహన్, కె.ఇందిరా కుమారి పాల్గొన్నారు.

టి.నరసాపురం: జెడ్పీ హైస్కూల్‌లో జాతీయ యోగా దినోత్సవం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈవో టి.రామ్మూర్తి మాట్లాడుతూ శారీరిక, మానసిక ప్రశాంతతకు యోగా ఉపయోగపడుతుందన్నారు. మండల అధ్యక్షులు హరిబాబు, జిల్లా సెక్రెటరీ రాంబాబు, జిల్లా ఎస్సీ మోర్చా నాయకులు రాయల మల్లేష్ ప్రసాద్ పాల్గొన్నారు.

లింగపాలెం: ఇంటర్నేషనల్ యోగ దినోత్సవాన్ని మండలంలోని పలు పాఠశాలల్లో నిర్వహించారు. కలరాయనగూడెంలోని ఉన్నత పాఠశాల విద్యార్థులు ఆసనాలు వేసి యోగ డే నిర్వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు కె.శ్రీనివాస్ మాట్లాడుతూ యోగాతో అనేక వ్యాధులను నియంత్రించొచ్చని తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కొయ్యలగూడెం: యోగా, ధ్యానం నేడు ప్రపంచ మానవాళి మనుగడకు ఆధార భూతమైనని ప్రముఖ యోగ గురువు చవ్వా సూరిబాబు పేర్కొన్నారు. యోగా దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. బలుసు నాగేశ్వరరావు, వి.జనార్ధన్ రావు, గుడిమెట్ల గంగాధరరావు, డి.సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

పోలవరం రూరల్: మండలంలో అంతర్జాతీయ యోగా దినోత్సవం నిర్వహించామని ఉపాధి హామీ ఏపీవో జి.వెంకటేశ్వరరావు తెలిపారు. ప్రగడపల్లి, వింజరం గ్రామాల్లో పాఠశాలల్లోని విద్యార్థులతో కలిసి యోగాపై అవగాహన కల్పించారు. ఎంపీడీవో జి.శ్రీను, సర్పంచ్ కలుం బాపిరాజు, ఉపాధి హామీ సిబ్బంది పాల్గొన్నారు.

ద్వారకాతిరుమల: మండలంలోని పలు పాఠశాలల్లో శుక్రవారం అంతర్జాతీయ యోగా దినోత్సవ కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. శ్రీవారి దేవస్థానం సంస్కృతోన్నత పాఠశాలలో బీజేపీ నాయకులు యోగా ప్రాముఖ్యతను తెలియజేశారు.



యోగా విశిష్టతను వివరిస్తున్న దృశ్యం


ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో యోగాసనాలు వేస్తున్న విద్యార్థులు


టి.నరసాపురంలో యోగాసనాలు వేస్తున్న విద్యార్థులు


కలరాయనగూడెంలో యోగా చేస్తున్న విద్యార్థులు


ఆసనాలు వేస్తున్న విద్యార్థులు


ప్రగఢపల్లిలో యోగా చేస్తున్న దృశ్యం

క్లుప్తంగా

దివ్యాంగుల స్కూలుకు వీల్ చైర్ బహూకరణ


పరింపూడి దివ్యాంగుల స్కూల్‌లో వీల్ చైర్ బహూకరిస్తున్న దృశ్యం

కొయ్యలగూడెం: పరింపూడి ప్రభుత్వ దివ్యాంగుల స్కూల్ (భవిత దివ్యాంగుల స్కూల్)లో శుక్రవారం ఒక విద్యార్థికి ది ఏలూరు జిల్లా కెమిస్ట్, డ్రగ్గిస్ట్ అసోసియేషన్ అధ్యక్షుడి ఆధ్వర్యంలో వీల్ చైర్ బహూకరించారు. సీమాంధ్ర డ్రగ్ డీలర్స్ అసోసియేషన్ ఎగ్జిక్యూటివ్ మెంబర్ మద్దు ప్రసాద్, ఏలూరు జిల్లా వైస్ ప్రెసిడెంట్ మోటమర్రి ఉమామహేశ్వరరావు, కొయ్యలగూడెం అసోసియేషన్ మెంబర్ గుడిమెట్ల గంగాధరరావు పాల్గొన్నారు.

పాఠశాలకు స్పీకర్ బహూకరణ


పాఠశాల హెచ్ఎం శేషుకుమార్‌కు స్పీకర్ అందజేస్తున్న పూర్వ విద్యార్థులు

ద్వారకాతిరుమల: స్థానిక శ్రీవారి దేవస్థానం సంస్కృతోన్నత పాఠశాల 2002-2003 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు పాఠశాలకు వైర్‌లెస్ స్పీకర్ విత్ మైక్ సెట్‌ను బహూకరించారు. దీన్ని పూర్వ విద్యార్థులు టేక్ బల్ బహదూర్, దాసరి శివన్నారాయణలు శుక్రవారం పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శేషుకుమార్‌కు అందజేశారు. విద్యార్థుల సౌకర్యార్థం వినియోగించాలని వారు కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

శ్రీవారి నిత్యాన్నదాన ట్రస్టుకు విరాళం


దాత రామసుధీర్‌కు విరాళం బాండ్ పత్రాన్ని అందిస్తున్న ఆలయ సూపరింటెండెంట్ రాజు

ద్వారకాతిరుమల: శ్రీవారి నిత్యాన్నదాన ట్రస్టుకు ఒక భక్తుడు శుక్రవారం రూ.1,00,000 విరాళంగా అందజేశారు. అనపర్తికి చెందిన వానపల్లి రామసుధీర్ ముందుగా కుటుంబ సభ్యులతో కలిసి స్వామి, అమ్మవార్లను దర్శించారు. అనంతరం ఈ విరాళాన్ని నిత్యాన్నదాన కార్యాలయంలో జమ చేశారు. ఈ సందర్భంగా దాతకు ఆలయ సూపరింటెండెంట్ రాజు విరాళం బాండ్ పత్రాన్ని అందించారు.

విద్యార్థులు క్రమశిక్షణతో మెలగాలి


విద్యార్థులకు స్కూల్ బ్యాగులు పంపిణీ చేసిన దృశ్యం

జంగారెడ్డిగూడెం రూరల్: మండలంలోని పట్టెన్నపాలెం ఎంపీపీ పాఠశాలలో శుక్రవారం విద్యార్థులకు బ్యాగులు, నోట్ పుస్తకాలు, పాఠ్య పుస్తకాలను పంపిణీ చేశారు. సర్పంచ్ పసుపులేటి రత్నకుమారి, వైఎస్సార్‌సీపీ నాయకులు పసుపులేటి నాగార్జునరావు చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ రత్నకుమారి మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో మెలగాలన్నారు. ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నూకాలమ్మకు వెండి విరాళాలు

జంగారెడ్డిగూడెం: నూకాలమ్మకు శుక్రవారం సందర్భంగా విశేష పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు అమ్మవారిని విశేషంగా అలంకరించారు. ఆలయ కల్యాణ వేదిక వద్ద ఉత్సవ మూర్తికి పంచామృతాభిషేకాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు రాజాన సత్యనారాయణ మాట్లాడుతూ అమ్మ వారి వెండి చీర తయారీకి బంగారు శ్రీను, రమణి దంపతులు 5 తులాల వెండి, బంకూరు వినయ్, లక్ష్మి దంపతులు 5 తులాల వెండి, అన్నంరెడ్డి రాజు, కుమారి దంపతులు, వారి కుటుంబ సభ్యులు 5 తులాల వెండి సమర్పించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, శ్రీ నూకాంబిక సేవా బృందం సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇరువురికి గాయాలు

చింతలపూడి: మండలంలోని ప్రగడవరం సచివాలయం సమీపంలో శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇరువురికి గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం పాణుకుమాడు గ్రామానికి చెందిన మైనేని వెంకటేశ్వరరావు, తోట ప్రసాద్‌లు ద్విచక్ర వాహనంపై వస్తుండగా ట్రాక్టర్ ఢీ కొనడంతో తీవ్ర గాయాలయ్యాయి. దీంతో వీరిని చికిత్స నిమిత్తం స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అడ్మిషన్లు

పోలవరం రూరల్: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియేట్ ప్రథమ, ద్వితీయ సంవత్సరాల అడ్మిషన్లు నిర్వహిస్తున్నారని, విద్యార్థులు చేరాలని, ప్రిన్సిపాల్ కె.సజని తెలిపారు. కళాశాలలో ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, హెచ్ఈసీ గ్రూపులు ఉన్నాయన్నారు. ఇప్పటి వరకు మొదటి సంవత్సరంలో 30 మంది విద్యార్థులు చేరారన్నారు.

28న సర్వ సభ్య సమావేశం

బుట్టాయగూడెం: మండల ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశం ఈ నెల 28న ఏర్పాటు చేయనున్నట్లు ఎంపీడీవో జి.సుధా ప్రవీణ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 గంటలకు జరిగే ఈ సమావేశానికి స్థానిక ప్రజా ప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు పాల్గొనాలని కోరారు.

ఘనంగా భూదేవి పండుగ

బుట్టాయగూడెం: మండలంలోని మారుమూల గ్రామం తూర్పుపాలకుంటలో శుక్రవారం ఘనంగా భూదేవి పండుగను నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని పెద్దలు భూమాతకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే మహిళలు సాంప్రదాయ నృత్యాలు చేశారు. వీరితో ఉపాధ్యాయుడు జలగం రాంబాబు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూదేవి పండుగను ప్రతీ ఏటా సాంప్రదాయ బద్ధంగా చేసుకోవడం ఆనవాయితీ అన్నారు. భూదేవి పండుగ అనంతరం వ్యవసాయ పనులు ప్రారంభిస్తారని తెలిపారు.

పంటలకు కనీస మద్దతు ధర ప్రకటించాలి


ఏరువాక పౌర్ణమి కార్యక్రమం ప్రారంభిస్తున్న దృశ్యం

చింతలపూడి: స్వామినాథన్ కమిషన్ సిఫార్సుల మేరకు అన్ని రకాల పంటలకు కనీస మద్దతు ధర ప్రకటించాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా అధ్యక్షులు పి.సోమశేఖరాచార్యులు డిమాండ్ చేశారు. మండలంలోని యర్రగుంటపల్లిలో రైతు సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం ఏరువాక పౌర్ణమి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఐ మండల కార్యదర్శి కె.గురవయ్య మాట్లాడుతూ అందరికీ అన్నం పెట్టే రైతన్న పరిస్థితి నేడు దయనీయంగా ఉందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతుల సమస్యల పరిష్కారంపై దృష్టి సారించాలని కోరారు. రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ ప్రకటించాలని డిమాండ్ చేశారు. రైతులకు వ్యవసాయ యంత్రాలు, వ్యవసాయ పనిముట్లు 50 శాతం సబ్సిడీపై అందించాలని విజ్ఞప్తి చేశారు. తక్షణం కౌలు గుర్తింపు కార్డులు అందించి, పంటల భీమాను సక్రమంగా అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి దొంతా కృష్ణ, సీపీఐ నాయకులు జంగా రామచంద్రారెడ్డి, ఆరేపల్లి వెంకట సుబ్బారావు, జనార్ధనాచారి, రైతులు పాల్గొన్నారు.

జీసీసీ ఉత్పత్తుల అమ్మకాలకు ప్రత్యేక చర్యలు

జీసీసీ డివిజనల్ మేనేజర్ పార్వతీశ్వరరావు


జీసీసీ డీఎం పార్వతీశ్వరరావు

బుట్టాయగూడెం: జీసీసీ ఉత్పత్తుల అమ్మకాల్లో లక్ష్యాలను సాధించే దిశగా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని గిరిజన సహకార సంస్థ (జీసీసీ) రంపచోడవరం డివిజనల్ మేనేజర్ జి.పార్వతీశ్వరరావు తెలిపారు. మండలంలోని కేఆర్‌పురం జీసీసీ వద్ద ఆయన విలేకర్లతో మాట్లాడుతూ 2023-24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి డివిజనల్ పరిధిలో సుమారు రూ.94 కోట్లు జీసీసీ ఉత్పత్తుల అమ్మకాలు లక్ష్యంగా పెట్టుకొన్నామని తెలిపారు. లక్ష్యాలను విజయవంతంగా పూర్తి చేశామన్నారు. అలాగే 2024-25 ఆర్థిక సంవత్సరానికి రూ.102 కోట్లు లక్ష్యంగా పెట్టుకున్నామని తెలిపారు. వీటిలో అటవీ ఉత్పత్తులకు రూ.3.35 కోట్లు కేటాయించగా మిగిలినవి వసతి గృహాలు, డీఆర్ డిపోలు, పెట్రోల్ బంక్‌లు తదితర వాటి ద్వారా విక్రయాలకు కృషి చేస్తున్నామని పేర్కొన్నారు. అదేవిధంగా కేఆర్‌పురం జీసీసీ వద్ద పెట్రోల్ బంక్, అడ్డతీగల, రంపచోడవరం పెట్రోల్ బంక్‌లు సమర్థవంతంగా నిర్వహిస్తున్నామన్నారు. రాజా ఒమ్మంగి పెట్రోల్ బంక్‌కు సంబంధించిన ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. బుట్టాయగూడెంలో సుమారు రూ.35 లక్షల వ్యయంతో కారం ప్యాకింగ్ యూనిట్ ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. అంతర్జాతీయ స్థాయిలో పేరుపొందిన అరకు కాఫీని ప్రతీ గిరిజన ప్రాంతంలో కాఫీ ప్రియులకు అందుబాటులోకి తెచ్చేలా కృషి చేస్తున్నామన్నారు. బుట్టాయగూడెం మండలంలోని కేఆర్‌పురం ఐటీడీఏ వద్ద, బుట్టాయగూడెంలో కాఫీ హౌస్‌ను ఏర్పాటు చేశామని తెలిపారు. ప్రజలకు జీసీసీ ఉత్పత్తులను చేరువ చేసేలా కృషి చేస్తామని తెలిపారు.

విద్యార్థులకు కిట్ల పంపిణీ


విద్యార్థులకు కిట్లు పంపిణీ చేస్తున్న దృశ్యం

కామవరపుకోట: జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు ప్రభుత్వం ద్వారా వచ్చే పాఠ్యపుస్తకాలు, నోట్ పుస్తకాలు అందించారు. కార్యక్రమానికి టీడీపీ నాయకుడు నేక్కలపూడి మల్లికార్జునరావు పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు గోపాల కృష్ణ, సర్పంచ్ రామ్మోహన్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

ఏపీ రైతు సంఘం ఆధ్వర్యంలో ఏరువాక

కుక్కునూరు: ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర సమితి పిలుపు మేరకు మండల కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం ఏరువాక కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రైతు సంఘం నాయకుడు మైసాక్షి వెంకటాచారి మాట్లాడుతూ రైతుల పట్ల, వ్యవసాయం పట్ల కేంద్ర ప్రభుత్వం దుర్మార్గంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. రైతులకు సక్రమంగా సాయమందించడం లేదని దుయ్యబట్టారు. ఎన్నికల సమయంలో కూటమి పార్టీలు రైతులకు ఇచ్చిన హామీలు అమలు చేయాలన్నారు. వ్యవసాయ సీజన్ ప్రారంభమవుతున్న తరుణంలో రైతుకు సాగు ఖర్చు రూ.20 వేల చొప్పున తక్షణమే చెల్లించాలన్నారు. అంతేకాక మండలంలోని పెద్దవాగు ప్రాజెక్ట్ కాలువ మరమ్మతులు చేపట్టి 16 వేల ఎకరాలకు సాగు నీరందేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు మడిపల్లి రమణయ్య, పల్లెల బిక్షం, సోడే నాగేష్, సోడే మారయ్య, సోడే ఇరమయ్య, కణితి రాము తదితరులు పాల్గొన్నారు.



ఏపీ రైతు సంఘం ఆధ్వర్యంలో ఏరువాక నిర్వహిస్తున్న సంఘ ప్రతినిధులు

మూడోసారి పంచాయతీ వేలం వాయిదా


పరింపూడి పంచాయతీ కార్యాలయంలో వేలం ప్రక్రియ నిర్వహిస్తున్న దృశ్యం

కొయ్యలగూడెం: మండలం పరింపూడి పంచాయతీలో నిర్వహించిన వేలం 24కు వాయిదా పడ్డాయి. శుక్రవారం సర్పంచ్ విజయలక్ష్మి అధ్యక్షతన ఏర్పాటు చేసిన ఆశీల వేలానికి సంబంధించి డైలీ మార్కెట్, సంత మార్కెట్‌లకు డిపాజిట్‌లను కట్టించుకొని వేలాన్ని ప్రారంభించారు. అయితే పంచాయతీ వారు నిర్ణయించిన ధరకు అనుకూలంగా వేలందారులు ముందుకు రాకపోవడంతో వాయిదా వేయక తప్పలేదు. ఇప్పటికే రెండుసార్లు వేలం వాయిదా పడింది. గత కొన్ని సంవత్సరాలుగా వేలంలో పాల్గొనే వారు సిండికేట్‌గా వ్యవహరిస్తూ పంచాయతీ ఆదాయానికి గండి కొడుతున్నారనే వాదన ఉంది. గత సంవత్సరం వేలం కంటే పది శాతాన్ని పెంచి వేలం ప్రారంభించాల్సి ఉంది. ఐతే వేలందారులు సిండికేట్‌గా మారి తక్కువకే వేలాన్ని చేజిక్కించుకుందామనే ఉద్దేశ్యంతోనే వాయిదాల పరంపరకి పరోక్షంగా కృషి చేస్తున్నారని వార్డు సభ్యులు ఆరోపిస్తున్నారు. ఈ నేపథ్యంలో ప్రతి సంవత్సరం సుమారు రూ.6 లక్షల వరకు పంచాయతీ ఆదాయం కోల్పోతోంది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు కలగజేసుకుని వేలం ప్రక్రియను సజావుగా నిర్వహించేందుకు కృషి చేయాలని ప్రజల కోరుతున్నారు.

ముగిసిన సీపీఎం శిక్షణ తరగతులు


శిక్షణ తరగతులు నిర్వహిస్తున్న దృశ్యం

పోలవరం రూరల్: మండలంలోని వింజరం గ్రామంలో రెండు రోజులు నిర్వహించిన సీపీఎం కార్యకర్తల శిక్షణ తరగతులు శుక్రవారంతో ముగిశాయి. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న సీపీఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి మాట్లాడుతూ కార్యకర్తలకు శిక్షణ తరగతులు నిర్వహించామని, ప్రజా సమస్యలపై పని చేసే సామర్థ్యాన్ని, మారుతున్న రాజకీయ పరిణామాలకు అనుగుణంగా ప్రతీ కార్యకర్త సిద్ధమవ్వాలన్నారు. పోలవరం ప్రాజెక్టు నిర్వాసితుల సమస్యల పరిష్కార దిశగా పని చేయాలన్నారు. సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు తెల్లం రామకృష్ణ మాట్లాడుతూ ఏజెన్సీలో 1/70 చట్టం ప్రకారం గిరిజనుల సాగులో ఉన్న భూములకు పట్టాలివ్వాలని కోరారు. మండల కార్యదర్శి గుడెల్లి వెంకట్రావు, జిల్లా కార్యవర్గ సభ్యులు నాగమణి, బాలరాజు పాల్గొన్నారు.

29న మెగా లోక్ అదాలత్

జూనియర్ సివిల్ జడ్జి మధుబాబు


కార్యక్రమంలో మాట్లాడుతున్న జూనియర్ సివిల్ జడ్జి మధుబాబు

చింతలపూడి: స్థానిక జూనియర్ సివిల్ కోర్టులో ఈ నెల 29న జరిగే మెగా లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని జూనియర్ సివిల్ జడ్జి మధుబాబు కోరారు. శుక్రవారం కోర్టు ఆవరణలో పోలీస్, ఎక్సైజ్ అధికారులు, న్యాయవాదులతో లోక్ అదాలత్‌పై కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయనం మాట్లాడుతూ పెండింగ్ కేసుల పరిష్కారానికి జాతీయ లోక్ అదాలత్‌లను వినియోగించుకోవాలని సూచించారు. మెగా లోక్ అదాలత్‌లో క్రిమినల్, సివిల్, బ్యాంక్ రికవరీ, చెక్ బౌన్స్, బీఎస్ఎన్ఎల్ రికవరీ, కుటుంబ తగాదాలు, మనోవర్తి, ప్రామిసరీ నోట్ కేసులు పరిష్కారం చేసుకోవచ్చని తెలిపారు. కేసులు రాజీ చేసుకునే వారి కోసం ప్రతీ రోజూ కోర్టులో ప్రీ లోక్ అదాలత్ సిట్టింగ్స్ నిర్వహిస్తున్నామన్నారు. కేసులు రాజీ చేసుకోవడం ద్వార విలువైన సమయం, డబ్బు ఆదా అవుతుందని తెలిపారు. సమాచారం కోసం దగ్గరలోని పోలీస్ స్టేషన్‌లను, కోర్టు సిబ్బందిని సంప్రదించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బి.నాగేశ్వరరావు, న్యాయవాదులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పలకల పంపిణీ


విద్యార్థులకు పలకలు పంపిణీ చేసిన దృశ్యం

జంగారెడ్డిగూడెం: గరుడ పక్షి నగర్ ఎంపీపీ పాఠశాల విద్యార్థులకు డాంగే నగర్ అంబేద్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం పలకలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో డాంగే నగర్ అంబేద్కర్ యువజన సంఘం గౌరవ అధ్యక్షుడు నేలపోలు ప్రభాకర్‌రావు, అధ్యక్ష కార్యదర్శులు కె.లక్ష్మణరావు, పటాన్ బాజీ, ప్రధానోపాధ్యాయురాలు నాగలక్ష్మి, సిబ్బంది పాల్గొన్నారు.

నిత్యావసర సరుకుల ధరలు తగ్గించాలి

కామవరపుకోట: పెరిగిన కూరగాయలు, నిత్యావసర సరుకుల ధరలు తగ్గించాలని సీపీఐ మండల కన్వీనర్ టీవీఎస్ రాజు ప్రభుత్వాన్ని ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీడీపీ అధికారం చేపట్టిన కొద్ది రోజుల్లోనే నిత్యావసర సరుకులు, కూరగాయ ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయన్నారు. ఐదు సంవత్సరాల తర్వాత అధికార పగ్గాలు చేపట్టిన తెలుగు దేశం ప్రభుత్వం అధికారం కొనసాగాలంటే పెరిగిన ధరలు తగ్గించాలని ఆయన డిమాండ్ చేశారు. అవసరమైతే బహుముఖ కార్యాచరణలు, ఆందోళనలు నిర్వహించి ప్రభుత్వాన్ని గద్దెదించుతామని ఆయన హెచ్చరించారు.